ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 30.0
కనిష్ఠం : 18.0


ఎస్ఎస్ఏ జిల్లా కార్యాలయం వద్ద ఉద్యోగుల నినాదాలు

354 మంది ఎస్ఎస్ఏ సమ్మె ఉద్యోగులకు ..

షోకాజ్ నోటీసులు

» నిరసిస్తూ జిల్లా కార్యాలయం వద్ద వాగ్వాదం-స్వల్ప ఉద్రిక్తత

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 6 : డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మెబాట పట్టిన సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అవుట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగులకు శనివారం షోకాజ్ నోటీసులను జిల్లా అధికారులు జారీ చేశారు. విద్యాశాఖ కార్యకలాపాలకు విఘాతం కలుగుతున్నందున తక్షణమే విధుల్లోకి చేరాలని, లేనిపక్షంలో వారిపై చట్టపర చర్యలు ఎందుకు తీసుకోరాదో వారం రోజుల్లోగా తెలపాలని షోకాజ్ నోటీసుల్లో పేర్కొన్నట్టు డీఈవో, ఎస్ఎస్ఏ అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ పి.శ్యాంసుందర్ తెలిపారు. నోటీసులు జారీచేసిన ఉద్యోగుల్లో మెసెంజర్లు, కార్యాలయ సిబ్బంది, మండలస్థాయి అక్కౌంటెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సైట్ ఇంజనీర్లు, సీఆర్పీలు తదితర కేడర్ల నుంచి మొత్తం 354 మంది ఉన్నారన్నారు. కాగా సమ్మెచేస్తున్న ఉద్యోగులకు శుక్రవారమే షోకాజ్ నోటీసులు జారీ చేయమన్నప్పటికీ ఎందుకు తాత్సారం చేస్తున్నారని రాష్ట్ర అధికారులు చేసిన ఒత్తిడి మేరకు శనివారం అప్పటికప్పుడు నోటీసులను జారీ చేయగా, ఆ వెంటనే ఉద్యోగులు ప్రదర్శనగా ఎస్ఎస్ఏ జిల్లా ప్రాజెక్టు కార్యాలయానికి తరలివచ్చి నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు చేరుకుని కార్యాలయ గేటు బయటకెళ్లి నిరసనలు తెలపాలని ఉద్యోగులను అక్కడినుంచి పంపించివేశారు. ఈ క్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు డీఈవో శ్యాంసుందర్‌ను కలుసుకుని నోటీసులపై చర్చలు జరుపగా, ప్రభుత్వ ఆదేశాలమేరకే వాటిని జారీచేయాల్సి వచ్చిందని వివరించారు. ఏలూరు జిల్లాలో మొత్తం 433మంది ఎస్ఎస్ఏ ఉద్యోగులు సమ్మెలో ఉండగా, శనివారం నోటీసులు జారీ అయిన నేపథ్యంలో కొందరు విధుల్లో చేరినట్టు అధికార వర్గాలు తెలిపాయి.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

ఏలూరు రూరల్, జనవరి 6: సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ నుంచి స్వగ్రామాలకు వచ్చేవారికోసం ఆర్టీసీ జిల్లా వ్యాప్తంగా ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల పరిధిలో ఈనెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు 90 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్టు ప్రజారవాణాశాఖ అధికారి ఎన్.వి.ఆర్ వరప్రసాద్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ 'ప్రత్యేక బస్సు సర్వీసులకు ఆన్‌లైన్ బుకింగ్ ఏర్పాటు చేశాం. పండుగ అనంతరం 16నుంచి 20వ తేదీ వరకు మూడు డిపోల నుంచి ఇప్పటివరకు దాదాపు 50 సర్వీసులకు రిజర్వేషన్లు సౌకర్యం ప్రారంభించాం. తిరుపతి, విశాఖపట్నం ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడుపుతాం. సంక్రాంతి కానుకగా ప్రయాణికులకు సాధారణ ఛార్జీలకే టిక్కెట్లు అందిస్తున్నాం. రాను,పోను టిక్కెట్లు బుక్‌చేసుకున్న వారికి ఒక టిక్కెట్టుకు పదిశాతం రాయితీ అందిస్తా' మన్నారు.

దండు కదిలింది

» ఆచంటలో నేడు రా.. కదలిరా సభ 7
» జగన్ అరాచకాలపై ప్రజా దండయాత్ర
» వైసీపీపై తాడోపేడో తేల్చుకోవడానికి సన్నద్ధం


ముగ్గులు వేస్తున్న మహిళలు

హరివిల్లు

జంగారెడ్డిగూడెంలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు

మహిళల నుంచి విశేష స్పందన

జంగారెడ్డిగూడెం, జనవరి 6 : గొబ్బెమ్మలు, బంతిపువ్వులు, రంగవల్లులు, రంగులతో అలంకరించిన ముత్యాల ముగ్గులతో జంగారెడ్డిగూడెంలో సంక్రాంతి పండుగ వాతావరణం ముందుగానే కన్పించింది. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' సారథ్యంలో చింతలపూడి నియోజకవర్గ టీడీపీ యువనేత బొమ్మాజీ అనిల్ సౌజన్యంతో జంగారెడ్డిగూడెం త్రివేణి ప్రసాద్ కళాశాల గ్రౌండ్‌లో శనివారం ముగ్గుల పోటీలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి మొత్తం 63 మంది పాల్గొన్నారు. .

ముగ్గుల పోటీలతో సంప్రదాయాల పరిరక్షణ

టీడీపీ యువనేత బొమ్మాజి అనిల్ మాట్లాడుతూ గతంలో సంవత్సరమంతా మహిళలు తమ ఇళ్ల ముందు ముగ్గులు వేసేవారు. నేటి పోటీ ప్రపంచంలో తమ పిల్లల చదువులు, ఉద్యోగాల్లో మహిళలు నిమగ్నమవ్వడం వల్ల సంప్రదాయాలు కనుమరుగు అవుతున్నాయి. ఇటువంటి తరుణంలో ఏటా ముత్యాల ముగ్గులు పోటీలు నిర్వహిస్తూ సంక్రాంతి పండుగ విశిష్టతను, మన సంప్రదాయాలను గుర్తు చేస్తున్న ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థకు ప్రతీ ఒక్కరూ కృతజ్ఞతలు తెలపాలన్నారు. టీడీపీ నేత గోరుముచ్చు గోపాల్ యాదవ్ మాట్లాడుతూ ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలతో సంక్రాంతి పండుగను ముందుగానే తీసుకొచ్చారన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునేందుకు ఇటువంటి ముగ్గుల పోటీలు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. త్రివేణి ప్రసాద్ కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్ మాట్లాడుతూ మన సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవడం, నేటి యువతకు వాటిని నేర్పించడంలో ఆంధ్రజ్యోతి సంస్థ చేస్తున్న విశేష కృషి అభినందనీయమన్నారు. ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ బి.హరిబాబు మాట్లాడుతూ మహిళల్లోని నైపుణ్యతను వెలికితీయడానికి ఇటువంటి పోటీలు దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు జెట్టి గురునాథరావు, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జ్ రామకృష్ణ, న్యూస్ నెట్‌వర్క్ కో ఆర్డినేటర్ జీవీఎస్ఎన్ రాజు, యాడ్స్ మేనేజర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.


మొదటి స్థానంలో నిలిచిన దుర్గాభవానికి నగదు బహుమతి అందిస్తున్న బొమ్మాజి అనిల్


రెండో స్థానంలో నిలిచిన రేవతికి బహుమతి అందిస్తున్న గోరుముచ్చు గోపాల్ యాదవ్


మూడో స్థానంలో నిలిచిన భాగ్యలక్ష్మికి బహుమతి అందిస్తున్న ఎస్ఆర్ఆర్ సూర్యనారాయణరాజు


ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

విజేతలు వీరే..

ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీల్లో మొదటి స్థానంలో జి.దుర్గాభవాని (రూ.6వేలు), డి.రేవతి ద్వితీయ స్థానంలో (రూ.4వేలు), తృతీయ స్థానంలో దిగమర్తి భాగ్యలక్ష్మి (రూ.3వేలు) నగదు బహుమతిని అందుకున్నారు. వీరికి టీడీపీ యువనేత బొమ్మాజి అనిల్, టీడీపీ నేత గోరుముచ్చు గోపాల్ యాదవ్, ముఖ్యులు నగదు బహుతులను అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా పెనుమర్తి సీత, తలగారపు జ్యోతి, పగడం సౌభాగ్యవతి వ్యవహరించారు. మరో 10 కన్సొలేషన్ బహుమతులను అందజేశారు. ఎస్.అమిత, సోయం మాధురి, డి.వెంకటలక్ష్మి, సీహెచ్ శశికళ, ఎన్.లక్ష్మీప్రీతి, దొంతు వరలక్ష్మి, బొల్లుబోయిన మణి, వి.మంగ, పి.నాగగిరీష, వి.గాయత్రిలకు కన్సొలేషన్ బహుమతులను అందజేశారు. విజేతలందరికీ మద్ది అంజనేయస్వామి ప్రసాదపు లడ్డూ, పసుపు, కుంకుమ, జాకెట్ ముక్క అందజేశారు.



పోటీతత్వం అలవడింది..

గత పదకొండేళ్లగా వివిధ ప్రాంతాల్లో జరిగే ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. ఏటా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి నిర్వహించే ముగ్గుల పోటీల్లో పాల్గొనడం వల్ల పోటీతత్వం పెరిగింది. చుక్కలతో మన సంప్రదాయాలు, పండుగను చూపే విధంగా వేసిన నా ముగ్గు మొదటి స్థానాన్ని అందించింది.

- జి.దుర్గాభవాని, మొదటి బహుమతి విజేత





ఎంతో ప్రోత్సాహకరం

పండుగలు వస్తున్నాయంటే వివిధ క్రీడలు, కోడిపందేలకే పరిమితం కాకుండా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి మహిళల కోసం నిర్వహించే ముత్యాల ముగ్గుల పోటీలు ప్రోత్సాహకరంగా ఉన్నాయి. ముగ్గుల పోటీలో నాకు ద్వితీయ స్థానం లభించడం ఆనందంగా ఉంది.

- డి.రేవతి, ద్వితీయ బహుమతి విజేత





నైపుణ్యతకు పదును

ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థ నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీల్లో ఐదోసారి పాల్గొన్నా. గతంలో కన్సొలేషన్ బహుమతితో వెనుదిరిగారు. గతేడాది, ఈ ఏడాది తృతీయ స్థానంలో నిలవడం ఎంతో ఆనం దంగా ఉంది. ప్రతీసారి నాలో నైపుణ్యత పెరుగుతోంది.

- డి.భాగ్యలక్ష్మి, తృతీయ బహుమతి విజేత

నేడు ఏలూరులో ముగ్గుల పోటీలు

ఏలూరు, జనవరి 6 : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' సారథ్యంలో అనురాధ కన్‌స్ట్రక్షన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, చింతమనేని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చింతమనేని ప్రభాకర్ సౌజన్యంతో ఏలూరు అశోక్‌నగర్‌లోని కేపీడీటీ హైస్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు పోటీలు జరుగుతాయి. న్యాయ నిర్ణేతలు విజేతలను ఎంపిక చేసి మొదటి బహుమతి రూ.6 వేలు, రెండో బహుమతి రూ.4 వేలు, మూడో బహుమతి రూ.3 వేలు చొప్పున నగదుతోపాటు కన్సొలేషన్ బహుమతులు అందజేస్తారు.


ముగ్గులను తిలకిస్తున్న అతిథులు, ఆంధ్రజ్యోతి సిబ్బంది


కలెక్టర్ వద్ద బైఠాయించిన అంగన్‌వాడీలు

ఎస్మాకు భయపడేది లేదు

» 24 గంటల రిలే దీక్షలు చేపట్టిన అంగన్‌వాడీలు

ఏలూరు కలెక్టరేట్, జనవరి 6: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుంటే దేశవ్యాప్త ఉద్యమంగా మారుస్తామని మోదీ, జగన్‌ల భరతం పడతామని ఆలిండియా అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ ఫెడరేషన్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఏ.ఆర్ సింధు హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల సమ్మె 26వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాల్లో 24 గంటల రిలే దీక్షలు ప్రారంభించారు. శనివారం ఏలూరులో దీక్షలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. మహారాష్ట్ర, కర్నాటకలో నెలల తరబడి సమ్మెలు చేసి అక్కడి బీజేపీ ప్రభుత్వం మెడలు వంచి అంగన్‌వాడీలు సమస్యలు పరిష్కరించుకున్నారని తెలిపారు. ఆ ఉద్యమాల స్ఫూర్తితో ఏపీలోను సమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాడాలని పిలుపునిచ్చారు. డబ్బుల్లేవంటున్న జగన్ కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై ఎందుకు పోరాడడం లేదని ప్రశ్నించారు. తొలుత సమ్మెపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగాన్ని నిరసిస్తూ అంగన్‌వాడీలు దీక్షా శిబిరం నుంచి వందలాదిమంది ఫైర్‌స్టేషన్ వరకు నిరసన ర్యాలీ చేశారు. అక్కడే మానవహారంగా నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి పి.భారతి, ప్రాజెక్టు లీడర్లు స్వర్ణకుమారి, సత్యవతి, త్రివేణి తదితరులు దీక్షల్లో పాల్గొన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డి.ఎన్.వి.డి ప్రసాద్, ఏ.గోపి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై ఎస్మా పిచ్చుకపై బ్రహ్మాస్త్రమే..

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 6 : సమ్మెచేస్తున్న అంగన్‌వాడీలపై రాష్ట్రప్రభుత్వం ఎస్మాను ప్రయోగించడం పిచ్చుకపై బ్రహ్మాస్త్రమేనని ఏపీజేఏసీ రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్.ఎస్.హరనాథ్ ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోవడానికి ప్రభుత్వమే కారణమని, ఇందులో అంగన్‌వాడీల పాత్ర ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు. ఎస్మాను ప్రయోగించడమంటే అంగన్‌వాడీల గొంతును బలవంతంగా నొక్కేయడమేనని ఆరోపించారు. గ్రాట్యుటీ వంటి డిమాండ్లను కేంద్రప్రభుత్వదృష్టికి రాష్ట్ర అధికారులు తీసుకెళ్లి చర్చించాలని డిమాండ్ చేశారు. చిన్నపాటి ఉద్యోగులైన అంగన్‌వాడీలపై ప్రభుత్వ నిరంకుశ చర్యలుగానే ఎస్మాను భావించాల్సి ఉంటుందన్నారు.

స్పెల్-బీ ఉమ్మడి జిల్లా విజేతలకు బహుమతులు


బహుమతులు అందజేస్తున్న శ్రీలక్ష్మి

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 6 : ఆంగ్ల భాషలో ప్రావీణ్యత ఉంటే ప్రపంచ దేశాల్లో విద్య, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని ఏపీ సాహిత్య మండలి చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి అన్నారు. నగరంలోని ఆర్ఆర్‌పేట నారాయణ ఒలింపియాడ్ స్కూలులో శనివారం నిర్వహించిన స్పెల్-బీ పోటీల విజేతలకు ఆమె బహుమతులు అందజేశారు. శ్రీలక్ష్మి మాట్లాడుతూ, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మొత్తం 9500 మంది బాలబాలికలకు నిర్వహించిన పోటీల్లో 33 మంది విజేతలుగా నిలిచారని పేర్కొన్నారు. విద్యాసంస్థల ఉమ్మడి జిల్లా ఏజీఎం పి.రామి రెడ్డి ఆంగ్లం ఆవశ్యకతను వివరించారు. మాతృభాషకు ప్రాదాన్యతనిస్తూనే ఆంగ్ల భాషలో పట్టుసాధించేలా తర్ఫీదునిస్తున్నామని చెప్పారు. రీజినల్ ఇన్‌చార్జి ఏ.శ్రీనివాస్, ప్రిన్సిపాల్స్ హేమలత, వి.కామేశ్వరరావు, ఆర్అండ్‌డి హెడ్స్, సాఫ్ట్ స్కిల్స్ హెచ్‌వోడీ వల్లూరి వేదవతి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ ఏపీ జట్టుకు నందిని ఎంపిక


నందినితో హెచ్ఎం సునీత

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 6 : రాజస్థాన్‌లోని బార్మర్‌లో ఈ నెల 8 నుంచి 12 వరకు జరగనున్న జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్ఐ) అండర్-14 బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు తమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న పి.నందిని ఎంపికైందని ఏలూరు కస్తూరిబా మున్సిపల్ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం జి.సునీత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల చిత్తూరు జిల్లా మదనపల్లిలో రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో ఉత్తమ క్రీడానైపుణ్యాన్ని ప్రదర్శించిందన్నారు. నందినికి తర్ఫీదునిచ్చిన పీఈటీలు కె.మురళీకృష్ణ, ఎం.వి.ఎల్. ప్రసన్నలను హెచ్ఎం అభినందించారు.

'అంబేడ్కర్ భావజాలం' పోటీల విజేతలు ..

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 6 : విజయవాడలో ఈ నెల 19న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరుగనున్న నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టిన జన్ భాగీదారి కార్యక్రమాల్లో భాగంగా అంబేడ్కర్ భావజాలంపై జిల్లాలో అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు శనివారం స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ కళాశాలలో వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతల వివరాలను ఇంటర్మీడియట్ విద్యామండలి ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖరబాబు విడుదల చేశారు. వ్యాసరచనలో గోపాలపురం అంబేడ్కర్ గురుకుల కళాశాల విద్యార్థిని కె.కృష్ణవేణి, ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని పి.ఎస్.భానుజ, గోపాలపురం అంబేడ్కర్ గురుకులం విద్యార్థిని జి.శరణ్య ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. వక్తృత్వంలో గోపాలపురం కళాశాల వై.జెస్సికా, పోలసానిపల్లికి చెందిన జి.హాసిక, హనుమాన్ జంక్షన్ జె.ఎం.జె.కళాశాలకు చెందిన డి.వాసంతి, చిత్రలేఖనంలో ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఈ.భరత్, బుట్టాయిగూడెం కు చెందిన డి.దీపిక, హనుమాన్‌జంక్షన్ జె.ఎం.జె.కళాశాలకు చెందిన జి.ప్రవల్లిక, క్విజ్‌లో ఏలూరు జీజేసీ కళాశాల జి.ఎస్.ఎస్.నితేష్ బృందం, పోలసానిపల్లి ఏపీఎస్‌డబ్ల్యు రెసిడెన్షియల్ కళాశాల కె.వైష్ణవి బృందం, బుట్టాయిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల కె.డి.కుమార్ బృందం బహుమతులు గెలుచుకున్నాయని వివరించారు.విజేతలకు బహుమతులు త్వరలో అందజేస్తామని ఆర్ఐవో చెప్పారు.


అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు నియామకపత్రాలు అందజేస్తున్న రాష్ట్ర నేతలు

డీపీఆర్టీయూ జిల్లా కార్యవర్గం

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 6: డెమొక్రటిక్ పీఆర్టీయూ (డీపీఆర్టీయూ) ఏలూరు జిల్లా కార్యవర్గాన్ని శనివారం స్థానిక జిల్లా కార్యాలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎస్.చంద్రశేఖరఅజాద్, ఎం.రాంబాబు ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా ఎన్.గంగాధరరావు, ఉపాధ్యక్షుడిగా ఎన్.వి.కె.వీరబాబు, సంయుక్త కార్యదర్శిగా ఆర్.ఎన్.వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఆర్.నాగేంద్రసింగ్, కార్యవర్గ సభ్యులుగా ఎస్.అప్పారావు, ఎస్.శ్రీనివాస్, జి.గోపీకిషోర్, ఎస్.వేణుగోపాల్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, పరిశీలకునిగా ఎం.అచ్యుతరావు వ్యవహరించారు. సంఘ నేతలు ఎస్.వెంకటరాజు, ఎం.రాంబాబు, ఆర్.వెంకట్, కె.సూర్యచంద్ర పాల్గొన్నారు.

త్వరలో అన్ని డిపోలకు కొత్త బస్సులు

ఆర్టీసీ జోనల్ చైర్మన్ పెన్మెంటి మహేశ్

నరసాపురం, జనవరి 6: త్వరలో అన్ని డిపోలకు కొత్త బస్సులు కేటాయిస్తామని ఆర్టీసీ జోనల్ చైర్మన్, బోర్డు డైరెక్టర్ పెన్మెంటి మహేశ్ చెప్పారు. నరసాపురం డిపోను శనివారం ఆయన సందర్శించారు. డిపో ఆదాయం, ప్రయాణీకుల సంఖ్య, సర్వీసులపై ఆరా తీశారు. అనం తరం అయన మాట్లాడు తూ, సంస్థను లాభాలాబాట పట్టించేందుకు కార్మికులంతా సమిష్టిగా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆర్ఎం వీరయ్య చౌదరి, డీఎం సత్యనారాయణమూర్తి, ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ వర్మ ఉన్నారు.

శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ సాధారణం

ద్వారకాతిరుమల, జనవరి 6: చిన్నతిరుపతిగా ఖ్యాతి గాంచిన ద్వారకా తిరుమలేశుని సన్నిధిన శనివారం సాధారణ భక్తుల రద్దీ నెలకొంది. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతో తెల్లవారుజాము నుంచే ఆలయానికి యాత్రికుల రాక ప్రారంభమైంది. అయితే కేవలం వందలాది మంది యాత్రికులు మొక్కుబడులు తీర్చుకున్నారు.

దండు కదిలింది!

రాష్ట్రంలో అరాచకపాలన అంతమొందించే దిశగా టీడీపీ, జనసేన ఉమ్మడిగా అడుగులు వేస్తున్నాయి. జనంమధ్యకు నేరుగా కదలి వెళ్తున్నాయి. అంతకంటే మించి అక్రమ కేసులు, అవినీతి, ప్రతిపక్షాల అణచివేతను గట్టిగా వ్యతిరేకిస్తూ ఊరూవాడా జన ప్రవాహమై కదులుతున్నాయి. రా..కదలిరా.. అరాచక పాలన అంతమొందిద్దాం, అవినీతిని ఎండగడదాం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం, తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని పరిరక్షించుకుందామంటూ టీడీపీ రాష్ట్ర వ్యాప్తంగా బహిరంగ సభలకు సన్నద్ధ మైంది. లక్షలాది మంది ప్రజలు ఈనినాదానికి స్ఫూర్తిపొంది అడుగులో అడుగేస్తున్నారు.

- జగన్ అరాచకాలపై ప్రజా దండయాత్ర
- అధినేత చంద్రబాబు జనం మధ్యకు
- వైసీపీపై తాడోపేడో తేల్చుకోవడానికి సన్నద్ధం
- రెట్టించిన ఉత్సాహంతో క్షేత్రస్థాయి కేడర్
- ఆచంటలో నేడు రా.. కదలిరా సభ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

మునుపెన్నడూలేని విధంగా గడిచిన ఐదేళ్లల్లో రాష్ట్రంలో అరాచకం పేట్రేగింది. టీడీపీ కార్యకర్తలపై నేరుగా అక్రమకేసులు, అరెస్టులు.. ప్రశ్నించిందే తడవుగా వైసీపీ మూకల దాడులు.. టీడీపీకి మద్దతు ఇస్తామన్న ప్రతి ఒక్కరిపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారు. విధ్వంస పాలనకు చరమగీతం పాడాలన్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పిలుపునకు తెలుగు నేల స్పందిస్తోంది. వరుస బహిరంగసభలకు చంద్రబాబు హాజరవుతున్నారు. ఒకప్పుడు టీడీపీకి ఆయువుపట్టు అయిన పశ్చిమ గోదావరి జిల్లాలో వినూత్నమైన రీతిలో ఆదివారం ఆచంటలో జరిగే బహిరంగ సభలో చంద్రబాబు పాల్గొంటున్నారు. జిల్లాలు విభజించిన తరువాత లోక్‌సభ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు కలిపి ఒక జిల్లాగా విడగొట్టిన తరువాత మరింత విధ్వంసం సాగింది. పార్టీ ముఖ్యనేతలపై ఊహించని రీతిలో అక్రమ కేసులు మోపారు. ఇలాంటి పరిస్థితుల్లో తిరిగి టీడీపీకి పునర్వైభవం వచ్చేలా ఊరూవాడా జనం మధ్య తుగా కదులుతున్నారు. తాజాగా విభజిత పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోను తెలుగుదేశం- జనసేన పొత్తుతో భవిష్యత్తులో పోటీ చేసే అభ్యర్థులతో ఎలా ఢీకొనాలో తెలియక అధికారపక్షం ఇప్పటికే విలవిలలాడుతుంది. ఉమ్మడి పశ్చిమలో కేవలం పాలకొల్లు, ఉండి నియోజకవర్గాల్లో మాత్రమే టీడీపీ విజయం సాధించింది. ఈ బలంతోనే మొక్కవోని దీక్షతో అధికార పార్టీ అరాచక పాలనపై ఎదురుదాడికి ధైర్యంగా దిగారు. పాలకొల్లు ఎమ్మెల్యే, శాసనసభాపక్ష ఉపనేత నిమ్మల రామానాయుడు నేరుగా అధికార పక్షంపై విరుచుకుపడుతూ వచ్చారు. ఆయన దూకుడును కట్టడి చేసేందుకు ఎస్సీ, ఎస్టీ కేసులను ఆయనపై మోపేందుకు అధికారపక్షం సాహసించింది. అయినా వెన్ను చూపకుండా ప్రజాఆందోళనలు నిర్విరామంగా కొనసాగించారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి, సీనియర్ నేత పితాని సత్యనారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆచంట నియోజకవర్గంలోను తెలుగు తమ్ముళ్లు ఎక్కడా తగ్గేదేలే అన్నట్టుగా ఇన్నాళ్లు జగన్ సర్కారుపై పోరాడుతూనే వచ్చారు. ఇళ్ల స్థలాల అక్రమాలపైన, ఇసుక ర్యాంపుల అక్రమాలపైనా ఎక్కడా వెనక్కి తగ్గకుండా సాహసోపేతంగా కేడర్ వెంట రాగా, పితాని నిరసన ఆందోళనలు కొనసాగిస్తూ వచ్చారు. బీసీ వర్గాలను ఆసాంతం పార్టీ ఆవిర్భావం నుంచి గౌరవిస్తున్నది, అండగా నిలుస్తుందని టీడీపీ మాత్రమేననే సంకేతం కూడా ఆచంట నుంచే ఇవ్వబోతున్నారు. భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం నియోజకవర్గాల నుంచి సభకు తరలివెళ్లేందుకు రైతులు, విద్యార్థులు, మహిళలు, పేద వర్గాలు తహతహలాడుతున్నారు.


సభా వేదిక వద్ద రెపరెపలాడుతున్న టీడీపీ, జనసేన జెండాలు


సర్వం సిద్ధమైన సభా వేదిక

సార్వత్రిక ఎన్నికలు జరిగేందుకు పట్టుమని వంద రోజులు కూడా లేక మునుపే ఇప్పుడు అధికార వైసీపీని గడగడలాడిస్తుంది. ప్రతీనియోజకవర్గంలోను కార్యకర్తలు ఒక్కటై తమ పార్టీ అధికారంలోకి వచ్చేలా జగన్ అరాచక పాలన అంతమొందించేలా చమటోడుస్తున్నారు. విభేదాలకు తావులేకుండా ఉమ్మడిగా జనసేన, టీడీపీ శ్రేణులు ఒక్కటై నడుస్తున్నాయి. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో కన్వీనర్ వలవల బాబ్జి వైసీపీకి కంటిలో నలుసుగా మారడమే కాకుండా పార్టీ కేడర్ ఉత్తేజం, ఉత్సాహంగా పని చేసేలా సుదీర్ఘ కార్యాచరణకు ప్రణాళిక వేశారు. తణుకు నియోజక వర్గంలో నువ్వానేనా అన్నట్టు వైసీపీని టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఢీకొంటూ వచ్చారు. నియోజకవర్గంలో జరి గిన అక్రమాలన్నింటిపైనా ఆయన ఎలుగెత్తి పోరాడారు. కేసులకు భయపడకుండా ధైర్యంగా ఎదురొడ్డారు. ఉండి నియోజక వర్గంలోను ఎమ్మెల్యే రామరాజు వైసీపీపై పోరాడుతూనే పార్టీని పూర్తిగా విజయపథం వైపు నడిపించేందుకు సాయశక్తులా ప్రయత్నిస్తూనే ఉన్నారు. భీమవరం నియోజకవర్గంలో పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షురాలు సీతారామలక్ష్మితో సహా సీనియర్లంతా ఒకవైపు పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు కార్యక్రమాలు విజయవంతమయ్యేలా శ్రద్ధ పెడుతూనే వచ్చారు. మాజీ ఎమ్మెల్యే శివరామరాజు, ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ వంటి సీనియర్లంతా నిత్యం ప్రజల మధ్యే ఉంటున్నారు. చంద్రబాబు, లోకేశ్ నాయకత్వాన్ని పూర్తిగా బలపరిచే క్రమంలో పోరాడుతూనే ఉన్నారు. నరసా పురం నియోజకవర్గంలో కన్వీనర్ రామ రాజు, మాజీ ఎమ్మెల్యే మాధవనాయుడు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి పార్టీ కార్యక్రమాల్లో నిత్యం మమేకమై ముందుకు సాగుతున్నారు. పథకాలపై విస్తృత ప్రచారం, మహిళల్లో అవగాహన కల్పించడంలో తలమునకలై ఉన్నారు. వారం రోజులుగా నియోజకవర్గ కన్వీనర్లు, పార్టీ కేడర్ నిత్య సమీక్షలు, చర్చలు సాగించడమే కాకుండా బహిరంగ సభ విజయవంతం అయ్యేలా ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. కనీవినీ ఎరుగని రీతిలో ఆచంటలోనే సభ జరగనుండడంతో పితాని అన్నింటిని తన భుజాన కెత్తుకున్నారు. భారీ ఎత్తున కేడర్ తరలివచ్చేలా అన్ని ఏర్పాట్లు చేశారు.

ఉమ్మడి పశ్చిమలో జడ్జిలు వీరే..

ఏలూరు క్రైం, జనవరి 6 : ఇటీవల జూనియర్ సివిల్ జడ్జిల నియామకపు ప్రక్రియ హైకోర్టు నిర్వహించగా.. జూనియర్ సివిల్ జడ్జిలుగా పోస్టింగులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మరికొంత మందిని బదిలీ చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పోస్టింగ్‌లు పొందిన జడ్జిలు వీరే. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా చీరాలకు చెందిన వి.ఎస్.ఎన్. లక్ష్మీ లావణ్య, ఏలూరు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి (జువైనల్‌కోర్టు)గా గుడివాడకు చెందిన రచన బండిని నియమించారు. ప్రస్తుతం రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎస్. వాసుదేవ్‌కు పదోన్నతి కల్పించి ఏలూరులోనే ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పోస్టింగ్ ఇచ్చారు. కావలిలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న రొక్కం వరలక్ష్మిని నర్సాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు.

సూది పోటుకు బైబై..!

- చెమటతో షుగర్ పరీక్ష చేసే పరికరం
- మధుమేహ రోగులకు అద్భుత వరం

(ఏలూరు/ఉంగుటూరు-ఆంధ్రజ్యోతి)

ఉంగుటూరు మండలం నారాయణపురానికి చెందిన ఊసా చిరంజీవి శ్రీనివాసరావు అద్భుతమైన పరికరాన్ని ఆవిష్కరించారు. ఎలక్ట్రోకెమికల్ అనే ఈ పరికరంతో సూది పోటుతో పనిలేకుండా.. కేవలం చెమట చుక్కతో.. అదికూడా ఒకే ఒక్క నిమిషంలో శరీరంలోని గ్లూకోజ్ (మధుమేహం) స్థాయిని నిర్ధారించవచ్చు. చిరంజీవి నాలుగేళ్లపాటు శ్రమించి రూపొందించిన ఈ పరికరానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపి పేటెంట్ హక్కును కట్టబెట్టింది. ఇంతటి ఘనత సాధించిన శ్రీనివాసరావు తెలుగువారే కావడం మనకు గర్వకారణం. ఇది వినియోగంలోకి వస్తే.. పేద, మధ్యతరగతికి ఎంతగానో ఉపయోగపడనుందని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఆయన కాన్పూర్ ఐఐటీలో సీనియర్ ప్రాజెక్టు సైంటిస్ట్‌గా పనిచేస్తున్నారు. నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, శ్రీఅరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ, ఆంధ్రా విశ్వవిద్యాలయంలో పీజీ, సెంట్రల్ ఎలక్ట్రో కెమికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ కారైకుడి (తమిళనాడు)లో పీహెచ్‌డీ పూర్తిచేశారు.

ఇల్లులేని పేదలను పట్టించుకోండి..

ఎమ్మెల్యేకు మాజీ కార్పొరేటర్ వినతి

ఏలూరు రూరల్, జనవరి 6: ఇల్లు లేని పేదల బాధలు పట్టించుకోవాలంటూ వైసీపీ నేత, మాజీ కార్పొరేటర్ ఎరకల సాంబశివరావు శనివారం ఎమ్మెల్యే ఆళ్ల నానిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఏలూరులో స్థలం ఉండి పట్టారాక, పట్టా ఉండి సొంతంగా నిర్మించుకునే ఇంటికి డబ్బులురాక అనేకమంది పేదలు బాధపడుతున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. 2007-09, 2012లో కొత్తూరు -1, కొత్తూరు -2, మాదేపల్లి -2లో ఇళ్ల స్థలాలు కేటాయించారు. పట్టా ఇచ్చినా నేటికి ఇంటిస్థలం చూపలేదు. కొందరు ఇల్లుకట్టుకున్నారు. నయాపైసా లబ్ధిదారులకు అందలేదు. పైగా వారి నుంచి రూ.10 వేల నుంచి రూ.20వేల వరకు బెన్‌ఫిషరీ వాటాగా తీసుకున్నారు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం కానరాలేదని ఎరకల ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని లేఅవుట్‌లలో ఇచ్చిన ఇంటినెంబర్ ఒకదానికొకటి పొంతన లేకుండా ఉన్నాయని పేర్కొన్నారు.

కేంద్ర పథకాలకు జగన్ స్టిక్కర్లు: పురందేశ్వరి


మాట్లాడుతున్న పురందేశ్వరి

ఏలూరుటూటౌన్, జనవరి 6: రాష్ట్రంలో అమలు చేసే పథకాల న్నింటికి కేంద్రం ఇస్తున్న నిధులేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు. తంగెళ్ళ మూడి కల్యాణ మండపంలో శనివారం బీజేపీ రాష్ట్ర మోర్చ పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు అన్ని వర్గాలకు ప్రధాని నరేంద్రమోదీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని అన్నారు. గత 10 ఏళ్లుగా సబ్‌కాసాత్, సబ్‌కా వికాస్ నినాదంతో సంక్షేమ పాలన అందిస్తున్నా.. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన 27 పథకాలను రద్దు చేసి దళితులకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. కేంద్ర పథకాలన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం తమవిగా చెప్పుకుంటున్న తరుణంలో పదాధికారులకు ఆమె దిశానిర్దేశం చేశారు. కేంద్ర పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలని, బీజేపీని బలోపేతం చేయాలన్నారు. రాబోయే ఎన్నికలో బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. జాతీయ కార్యదర్శి సత్యకుమార్, రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్, జిల్లా అధ్యక్షులు విక్రమ్‌కిషోర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దాన భాస్కరరావు, బాడిత నారాయణరావు, అనీల్ ఆచార్య పాల్గొన్నారు. టీడీపీ సీనియర్ నేత మాగంటి బాబు మర్యాదపూర్వకంగా ఆమెను కలిశారు.

బీజేపీ- వైసీపీ మధ్య ప్రొటోకాల్ వివాదం

- అర్ధంతరంగా ముగిసిన వికసిత్ భారత్ సంకల్ప సభ


మాధవరం సభలో బీజేపీ నేతలు

కుక్కునూరు, జనవరి 6 : వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా శనివారం మాధవరంలో జరుగుతున్న సభలో బీజేపీ, వైసీపీ నాయకుల మధ్య తలెత్తిన వివాదంతో సభ అర్ధాంతరంగా ముగిసింది. స్టేజ్ పైన మోదీ ఫొటో చిన్నదిగా ఉండటాన్ని చూసి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కరి బండి నాగరాజు ఆక్షేపించారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించడానికి సంకల్ప యాత్ర నిర్వహిస్తున్న తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రధాని మోదీ ఫొటో పెద్దగా ఉండాలని కోరుతున్నామన్నారు. వైసీపీకి చెందిన మాధవరం ఎంపీటీసీ కుండా సూర్యనారాయణ స్టేజి పైనుంచి లేచి వెళ్లిపోయారు. ఈ క్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి వెనుక సీటు నుంచి ముందుకు వచ్చి కూర్చున్నారు. దీంతో వైసీపీ-బీజేపీ నాయకుల మధ్య ప్రొటోకాల్ వివాదం చెలరేగింది. సభ అర్ధాంతరంగా ముగిసింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నట్టుగా వైసీపీ నాయకులు చెప్పుకుంటున్నారని నాగరాజు ఆరోపించారు.

'వైసీపీ అరాచకపాలనకు స్వస్తి పలకండి'


జెండా ఊపి రథాలను ప్రారంభిస్తున్న గన్ని

భీమడోలు, జనవరి 6 : నాలుగున్నరేళ్ల వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకాలని, టీడీపీ ప్రారంభించిన 'రా కదలి రా', 'జయహో బీసీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పిలుపు నిచ్చారు. తన క్యాంపు కార్యాలయంలో శనివారం జయహో బీసీ ప్రచార రథాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా గన్ని మాట్లాడుతూ, వైసీపీ అవినీతి అరాచక పాలనను తుదముట్టించడం అందరి బాధ్యత అన్నారు. బీసీలు, ఎస్టీలు ఎలా దగా పడ్డారో ప్రభుత్వ, ప్రైవేటు భూములు అన్న తేడా లేకుండా జగన్ అనుచరులు ఎలా కబ్జా చేస్తున్నారో తెలియజెప్పడమే ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఎలా దారి తప్పిందో ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. శిరిబత్తిన కొండబాబు, పుల్లయ్య నాయుడు, పెద్దిరాజు, శేషుగిరి, గంధం లక్ష్మణ్ పాల్గొన్నారు.

రంగా ఆశయ సాధనకు కృషి చేయాలి

- కొయ్యలగూడెం, పరింపూడిలో విగ్రహాల ఆవిష్కరణ


కొయ్యలగూడెంలో రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రాధ

కొయ్యలగూడెం, జనవరి 6: వంగవీటి రంగా ఆశయ సాధనకు అభిమానులంతా కృషి చేయాలని ఆయన తనయుడు రాధ కోరారు. కొయ్యలగూడెం, పరింపూడిలో శనివారం రంగా విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధ మాట్లాడుతూ రంగా చేసిన సేవలే ఈ రోజుకీ ఆయన అభిమానులు తనను కూడా ఆశీర్వదిస్తున్నారని పేర్కొన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు మాట్లాడుతూ, రంగా ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన పేద బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎన్నో సేవలు అందించారన్నారు. మాజీ ఎంపీ మాగంటి బాబు మాట్లాడుతూ, పార్టీలు, కులాలకు అతీతంగా రంగాను ఆరాధిస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో రాధ సేవలను వినియోగించుకుంటామని తెలిపారు. రాధను దత్తత తీసుకున్నట్టు ప్రకటించారు. కాంగ్రెసు నేత జెట్టి గురునాధరావు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ, మాజీ జెడ్పీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, టీడీపీ పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్, జనసేన నియోజకవర్గ కన్వీనర్ సిర్రి బాలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయిబాబు, పి. రామారావు, దుగ్గిన శ్రీను, తాడికొండ మురళీకృష్ణ, ముప్పిడి విజయకుమారి, సత్యన్నారాయణ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 6: నవాబుపాలెం రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి (35) మృతి చెందాడు. వివరాలివి. స్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి పట్టాలు దాటుతుండగా విశాఖవైపు వెళ్తున్న రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నీలంరంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించాడని జీఆర్‌పీ ఎస్ఐ జి.శ్రీహరిబాబు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని కోరారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడికి గాయాలు

ఉంగుటూరు, జనవరి 6: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలివి. చేబ్రోలు పోలీసు స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిపై ఉంగుటూరుకు చెందిన జలసూత్రం ఏసు అనే యువకుడు తీవ్ర గాయాలతో పడిఉన్నాడు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణాలను సేకరిస్తున్నారు.


స్వాధీనం చేసుకున్న నగదు

కారులో అక్రమంగా తరలిస్తున్న రూ.50 లక్షల నగదు పట్టివేత

జీలుగుమిల్లి, జనవరి 6 : ఎటువంటి ఆధారాలు లేకుండా కారులో తరలిస్తున్న రూ.50 లక్షలు నగదును పోలీసులు పట్టుకున్నారు. సీఐ బి.వెంకటేశ్వరావు తెలిపిన వివరాలు ప్రకారం. జీలుగుమిల్లి శివారు తాటియాకులగూడెం రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద శనివారం పోలీస్ అధికారులు సిబ్బంది కలసి వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో తరలిస్తున్న రూ.50 లక్షల నగదు గుర్తించారు. డ్రైవర్ పి.సుబేష్‌ను ప్రశ్నించగా ఎటువంటి ఆధారాలు చూపలేదు. కారుతోపాటు నగదు స్వాధీనం చేసుకున్నారు. వీఆర్వోలు మాధురి, తిరుపతమ్మల ఆధ్వర్యంలో పట్టుకున్న నగదు (రూ.500నోట్లు) లెక్కించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి నుంచి రావులపాలెం వెళుతున్నట్లు చెప్పారు.



ఐదు మూగజీవాలు మృతి

ద్వారకాతిరుమల, జనవరి 6: అనుమానాస్పదస్థితిలో ఐదు మూగ జీవాలు ఒక్కసారిగా మృతి చెందిన ఘటన మండలంలోని గుండుగొలను కుంటలో శనివారం ఉదయం వెలుగుచూసింది. వివరాలివి. రైతు ఉజ్జు గంగరాజుకు వ్యవసాయ పొలంలో పది పశువులు ఉన్నాయి. వాటికి శుక్రవారం సాయంత్రం యథావిధిగా దాణా, నీరు అందించారు. అప్పటికే అందులో కొన్ని నలతగా ఉన్నాయి. శనివారం ఉదయం పొలం వెళ్లి చూడగా, అందులో మూడు పాడి గేదెలు, ఒక ఆవు, ఒక పెయ్యిదూడ మృతి చెంది ఉన్నాయి. ఏరియా వెటర్నరీ వైద్యులు ఇక్కుర్తి సాయి రమేష్ శనివారం ఉదయం తన సిబ్బందితో వచ్చి పరిశీలించారు. వాటికి పోస్టుమార్టం నిర్వహించారు. సాంపిల్స్ పరీక్షాకేంద్రానికి పంపుతామని నివేదిక ఆధారంగా రైతుకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

గంజాయి రవాణా చేస్తున్న నలుగురి అరెస్ట్

- 38 కేజీలు, రెండు కార్లు స్వాధీనం


పట్టుబడిన నిందితులు, గంజాయి, కార్లు

పెదపాడు, జనవరి 6: విశాఖ నుంచి మధ్యప్రదేశ్‌కు గంజాయి రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు వారి నుంచి 38కేజీలు స్వాధీనం చేసుకున్నామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు చెప్పారు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు మండలంలోని కలపర్రు టోల్ ప్లాజా వద్ద శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా, రెండు కార్లలో ఉన్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని క్షుణ్ణంగా తనిఖీ చేయగా వారివద్ద 38 కేజీల గంజాయి లభించింది. కార్లను స్వాధీనం చేసుకుని మహారాష్ట్ర, గ్వాలియర్‌లకు చెందిన హరియాం (26), గణేష్ మిశ్ర (37), వినోద్ (35), దీపక్‌కుమార్ (32)లను అరెస్టు చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో అసిస్టెంట్ ఎస్ఐబి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ ధనరాజ్, ఏలూరు ఎస్ఐబి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి , సిబ్బంది పాల్గొన్నారు.

గతంలో కొన్న మోటార్‌కే బిల్లు పెట్టి అడ్డంగా దొరికాడు!

- ఆసుపత్రి అధికారులనే బురిడీ కొట్టించిన ప్లంబర్
- ఉద్యోగిపై పోలీస్ కేసుకు యత్నం.. పైనుంచి వత్తిడి?

అపహరించిన మోటార్ ఇదే..


ఏలూరు క్రైం, జనవరి 6 : ఆసుపత్రిలో ప్లంబర్‌గా పనిచేస్తు న్న ఓ ఉద్యోగి తన చేతి వాటాన్ని ప్రదర్శించి ఆసుపత్రి అధికారులనే బోల్తా కొట్టించడానికి ప్రయత్నిం చి చివరకు తానే బోల్తాపడి అడ్డంగా దొరికిపోయాడు. ఏలూ రు ప్రభుత్వాసుపత్రి గత ఏడాది ఏప్రిల్ వరకు వైద్య విధాన పరిషత్‌లో ఉండేది. మెడికల్ కాలేజీగా అవతరించిన తరువాత ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది బదిలీ అయ్యారు. మరికొంత మంది డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. ప్లంబర్‌గా పనిచేస్తున్న ఉద్యోగి ఒకరు తన చేతి వాటాన్ని యథేచ్ఛగా ప్రదర్శిస్తూనే ఉన్నాడు. చిన్నచిన్న మరామతులకు ఎక్కువ బిల్లులు పెట్టడం, కొత్తగా వచ్చిన అధికారులు ఆ బిల్లులు అంతగా పట్టించుకోకపోవడంతో ఇదే అదునుగా తీసుకుని ఏకంగా ఆసుపత్రిలో గతం లో కొనుగోలు చేసిన కొత్త మోటారును ప్రస్తుతం కొన్నట్లుగా రూ.70 వేలు కాజేయడానికి ప్రయత్నించి అడ్డంగా దొరికిపో యాడు. ఏలూరు ప్రభు త్వాసుపత్రిలో ఎంసిహెచ్ విభాగం వెనుక మోటార్లు పనిచేయకపోవడంతో యుద్ధ ప్రాతిపదికన మోటారు ఏర్పాటు చేయాల్సి వచ్చి ప్లంబర్‌ను అధికారులు ఆదేశించారు. గతంలోనే కొనుగోలు చేసిన ఒక మోటారు తన స్టోర్ రూమ్‌లో ఉన్న విషయం ఎవరికి తెలియకపోవడంతో దానిని కొత్తగా కొనుగోలు చేసినట్లుగా చెప్పి ఏకంగా రూ.70 వేలు కొటేషన్ బిల్లు తెచ్చి అప్పగించాడు. ఆ మోటారు ఏ షాపులో కొన్నారు, ఎక్కడ కొన్నారో వివ రాలు అడగగా అతడు కంగారు పడడంతో పూర్తిస్థాయిలో ఆరా తీశారు. గతంలోనే కొనుగోలు చేసి ఆ మోటారును ఇప్పుడే కొన్నట్లుగా చూపి బిల్లు లు పెట్టేశాడు. చివరకు ఆ ఉద్యోగి కాళ్లవేళ్ల పడి తనను క్షమించాలంటూ లేఖ రాసి అధికారులకు ఇచ్చాడు. పోలీస్ కేసు పెట్టడానికి అధికారులు సిద్ధమయ్యారు. గతంలో ఇదే విధంగా దొంగ బిల్లులు తెచ్చి సొమ్ము తీసుకు న్నట్టు చెప్పుకుంటున్నారు. ఉద్యోగి క్షమించమని రాసి ఇచ్చిన లేఖతో అధికా రులు మిన్నకుండిపోవడంపై పలువిమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారు లు పూర్తిస్థాయి విచారణ చేపడితే అనేక విషయాలు వెలుగులోకి వస్తాయి. ఆ ఉద్యోగిని కాపాడడానికి మరి కొందరు ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది.

ముత్యాల ముగ్గులు



జంగారెడ్డిగూడెం, జనవరి 6: ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీత్రి వేణి ప్రసాద్ విద్యాసంస్థల మైదానంలో శనివారం జరిగిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో మహిళలు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం 63 మంది మహిళలు పాల్గొనగా మొదటి ముగ్గు రు విజేతలతో పాటు మరో పది మందికి కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. ఎస్. అమిత, సోయం మాధురి, డి.వెం కటలక్ష్మి, సీహెచ్ శశికళ, ఎస్.లక్ష్మీప్రీతి, దొంతు వర లక్ష్మి, బొల్లుబోయిన మణి, వి.మంగ, పి.నాగ శిరీష, వి.గాయత్రి కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. పాల్గొన్న ప్రతి మహిళకు ప్రోత్సాహక బహుమతి అందజేశారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెనుమర్తి రామ్‌కుమార్, రాజాన సత్యనారాయణ, చేను ప్రసాద్, సాయిల సత్యనారాయణ, బొబ్బర రాజ్‌పాల్‌కుమార్, పారేపల్లి నరేష్, గుళ్లపూడి శ్రీదేవి, కోటగిరి ప్రమీల, శ్రీదేవి, సుబ్రహ్మణ్యం, కాసాని ప్రసాద్, మన్యం దుర్గారావు, రామచంద్ర రావు, రావూరి కృష్ణ, తూటికుంట రాము, నంబూరి రామచంద్రరాజు, ప్రసాద్, సిటీ కేబుల్ ఎండీ పాలపర్తి శ్రీనివాస్, దాకారపు గోపాలకృష్ణ, పరిమి సత్తిపండు, ఆలపాటి నాని, ఎస్ఆర్ఆర్ సూర్యనారాయణరాజు, మురళి, ఆంధ్రజ్యోతి సిబ్బంది ఉదయ్ భాస్కర్, జె.నరేష్‌కుమార్, ఎస్.కమలాకర్, నాదెండ్ల కృష్ణ, ఎం.సాయిబాబు, పి.రామకృష్ణ, దుర్గారావు, దాసు తదితరులు పాల్గొన్నారు.



ముగ్గులు పరిశీలిస్తున్న పట్టణ ప్రముఖులు, నేతలు



ముగ్గులు పరిశీలిస్తున్న మహిళలు



బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో మహిళలు



ముగ్గుల పోటీల నిర్వహణలో ఆంధ్రజ్యోతి సిబ్బంది











బి.మణి, ఎస్.మాధురి, డి.వెంకటలక్ష్మి, సీహెచ్.శశికళ, ఎస్.లక్ష్మీప్రీతికి కన్సొలేషన్ బహుమతులు అందజేస్తున్న బొబ్బర రాజ్‌పాల్‌కుమార్, పెనుమర్తి రామ్‌కుమార్, పారేపల్లి నరేష్, రాజాన పండు











వి.గాయత్రి, పి.నాగ శిరీష, వి.మంగ, ఎస్.అమిత, డి.వరలక్ష్మికి కన్సొలేషన్ బహుమతులు అందజేస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి రామకృష్ణ, ఉమ్మడి జిల్లా న్యూస్ కోఆర్డినేటర్ జీవీఎస్ఎన్ రాజు, బ్రాంచి మేనేజర్ బి.హరిబాబు, హెచ్‌బీఆర్ ప్రసాద్, సాయిల సత్యనారాయణ



తాడు లాగుడు పోటీలో ఎస్పీ మేరీ ప్రశాంతి, ఐజీ అశోక్‌కుమార్

క్రీడలతో ఆరోగ్యం : ఐజీ అశోక్ కుమార్

ఏలూరు క్రైం, జనవరి 6: క్రీడలతో మానసిక ప్రశాంతత, ఆరోగ్యం లభిస్తుందని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ.అశోక్‌కుమార్ అన్నారు. ఏలూరు జిల్లా స్పోర్ట్స్ మీట్ ముగింపు శనివారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న అశోక్‌కుమార్ ముందుగా పిస్టల్ పేల్చి రిలే పరుగు పందెం ప్రారంభించారు. ఎప్పుడు విధి నిర్వహణలో ఉండే సిబ్బంది క్రీడా పోటీలతో ఒత్తిడి నుంచి ఉపశమనం పొందుతారన్నారు. ప్రజలకు అత్యవసర సమస్య ఉంటే వెంటనే వారికి గుర్తు వచ్చేది పోలీసులేనని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎస్పీ డి.మేరీ ప్రశాంతి మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణ పెంపొందుతుందన్నారు. జిల్లాలో నాలుగు సబ్ డివిజన్లకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ మేరి ప్రశాంతి రెండు జట్లుగా తాడు లాగుడు పోటీతో క్రీడాకారులను ఉత్సాహపరిచారు. విజేతలకు ఐజీ, ఎస్పీ పతకాలు అందించారు. కార్యక్రమంలో ఎస్ఈబి ఏఎస్పీ ఎస్.సూర్యచంద్రరావు, ఏఎస్పీ ఎంజెవి భాస్కరరావు, ఏఆర్ ఏఎస్పీ ఎస్ఎస్ శేఖర్, ఏఆర్ డీఎస్పీ బి.చంద్రశేఖర్, ఏలూరు డీఎస్పీ ఇ శ్రీనివాసులు, డిటీసీ డీఎస్పీ కె.ప్రభాకరరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మాతృభాషా వలంటీర్ల రిలే దీక్షలు



రిలే దీక్షలు చేస్తున్న విద్యా వలంటీర్లు

బుట్టాయగూడెం, జనవరి 6: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మాతృభాషా విద్యా వలంటీర్లు ఐటీడీఏ వద్ద రిలే దీక్షలను శనివారం కొనసాగించారు. మూడు నెలల వేతన బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. సమస్యలు పరిష్కరించమంటే బెదిరింపులకు గురి చేయడం సరికాదన్నారు. స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

తెగుళ్ల నిర్ధారణపై క్షేత్రస్థాయి పరిశీలన

పెదపాడు, జనవరి 6: అపరాల సాగులో తెగుళ్ల ఉధృతిని సకాలంలో గుర్తించడం ద్వారా నివారణ చర్యలు చేపట్టి పంటలను కాపాడుకోవచ్చునని డాట్ ప్రధాన శాస్త్రవేత్త కె.ఫణికుమార్ తెలిపారు. పెదపాడు, పరిసర ప్రాంతాల్లోని అపరాల పంటలను శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పెసర, మినుము పంటలలో బూడిద తెగులు, ఆకుమచ్చ, పల్లాకు తెగులు, మరూకా మచ్చల పురుగులను గమనించామన్నారు. నివారణకు బావిస్టిన్ ఒక గ్రాము లేదా హెక్సా కొనజోల్ 2 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. మరుకా మచ్చల పురుగు నివారణకు ఇండాక్సికాబ్, కొరాజిన్ ఏదో ఒక మందును పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ సెంటర్ ఏడీఏ పి.లలిత సుధ, ఏవో వి.ప్రదీప్‌కుమార్, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

12 వరకు కోర్టు విధుల బహిష్కరణ

ఏలూరు క్రైం, జనవరి 6 : భూ హక్కు చట్టాన్ని నిరసిస్తూ న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఈనెల 12 వరకూ కొనసాగించడానికి కార్యవర్గం నిర్ణయించిందని ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఎం నాగరాజు తెలిపారు. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు (యాక్టు 27/2023) జీఓఎంఎస్ నెంబర్ 512 ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టైటిలింగ్ యాక్టు వల్ల ప్రజలు తమ భూ హక్కును కోల్పోతారని వీటిని వెంటనే రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ నెల 12 వరకూ కోర్టు విధులను బహిష్కరించి తమ రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తామని తెలిపారు.

అంతరిక్ష ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న విశ్రాంత శాస్త్రవేత్త శివప్రసాద్

ఉంగుటూరు, జనవరి 6: మండలంలోని కైకరం హైస్కూలు విద్యార్థులకు రాకెట్ ప్రయోగంలో వివిధ ప్రక్రియలపై విశ్రాంత శాస్త్రవేత్త యాళ్ళ శివప్రసాద్ శనివారం అవగాహన కల్పించారు. రాకెట్ ప్రయోగంతో పాటు ఇస్రో ఏర్పాటుతో పాటు ఇటీవలి చంద్రయాన్-3వరకు జరిగిన ప్రయోగాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమానికి హెచ్ఎం గుళ్ళ ప్రసాదరావు అధ్యక్షత వహించగా ఎంఈవో కాండ్రేగుల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం యాళ్ళ శివ ప్రసాద్‌ను ఉపాధ్యాయ బృందం చేబ్రోలు శ్రీనివాసకుమార్, కె.భువనేశ్వరి, తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు.

రోమ్ మిషనరీ జనరల్ కౌన్సిల్‌గా మోరియో

దెందులూరు, జనవరి 6: రోమ్ మిషనరీ ఆఫ్ ఫెయిత్ జనరల్ కౌన్సిల్‌గా ఎన్నికైన ఫాదర్ కె.మోరియోను సానిగూడెంలో ఉపాధ్యాయుడు చుక్కా అవినాష్ రాజు శనివారం సన్మానించారు. మోరియో 19 దేశాలకు జనరల్ కౌన్సిలర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. ఏలూరుకు చెందిన కూరపాటి రాయప్ప, చిట్టెమ్మ దంపతుల కుమారుడు మోరియోను ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు, ఫాదర్ జి.మోజెస్, ఫాదర్ జోజి, ఫాదర్ డొమ్నిక్, దిద్ల యోంజీల్లో అభినందించారు.



ఏలూరు నగర పాలక సంస్థ, చింతలపూడి, జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయాల వద్ద కళ్లకు గంతలతో కార్మికుల నిరసన

మున్సిపల్ కార్యాలయ ముట్టడి

పారిశుధ్య కార్మికుల సమ్మె, నిరసన

ఏలూరు టూటౌన్, జనవరి 6: మున్సిపల్ కార్మికులు నగర పాలక సంస్థ కార్యాలయాన్ని ముట్టడించారు. వివిధ విభాగాల కార్మికులు శనివారం నగర పాలక సంస్థ వద్దకు చేరుకుని గేట్లు మూసివేసి సిబ్బందిని లోనికి వెళకుండా అడ్డుకున్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య మాట్లాడుతూ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. రెండు దఫాలుగా చర్చలు జరిగినప్పటికి ఎలాంటి పురోగతి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలన్నారు. లేకుంటే ఈ నెల 8న కలెక్టరేట్ ముట్టడిస్తామన్నారు. ఎన్నికల ముందు జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలనే నెరవేర్చాలని కోరుతున్నామన్నారు. కృష్ణారావు, జాన్‌బాబు, వెంకటేశ్వరరావు, నాగరాజు, హనుమంతరావు, రాజు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ, కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె నాలుగో రోజుకు చేరింది. నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద శనివారం కార్మికులు కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు కృష్ణమాచార్యులు, కన్నబాబు, అప్పలరాజు, శ్రీనివాసరావు, భాస్కరరావు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: మునిసిపల్ కార్మికులు శిబిరంలో కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు టి.బాబు మాట్లాడుతూ మునిసిపల్ కార్మికుల సమ్మె న్యాయమైనదేనని, ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఇప్పుడు అమలు చేయకపోవడం దారుణమన్నారు. కంచర్ల గురవయ్య, అంగన్‌వాడీ నాయకురాలు గంధం అంజమ్మ, ఆర్.మరియమ్మ, మల్లేశ్వరి, మానుకొండ సర్వేశ్వరరావు పాల్గొన్నారు. మునిసిపల్ వర్కర్లు, అంగన్‌వాడీల సమస్యల సమ్మె ఉధృతమైనా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీఐటీయూ నాయకులు ఆర్వీ.సత్యనారాయణ అన్నారు. మునిసిపల్ కార్మికులతో మెట్లపై కూర్చొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సరోజిని, మాణిక్యం, పలువురు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం టౌన్: మున్సిపల్ కార్మికులు కళ్లకు నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన తెలియజేశారు. ఐఎఫ్‌టీయూ నాయకులు కెవి.రమణ, ఎస్ రామ్మోహన్ సమ్మెకు సంఘీభావం తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి బొక్కా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎరియర్స్ చెల్లించాలని, తమకు అవసరమైన మౌలిక సదుపాయాలు ప్రభుత్వం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జేవీ.రమణరాజు, కొత్తూరి నాగేశ్వరరావు, రేలంగి నాగరాజు, పితాని సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

జంగారెడ్డిగూడెం, జనవరి 6: ముత్యాలమ్మ నగర్‌లో యువకుడి మృతి ఘటనపై అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ బి.విద్య తెలిపారు. కొండేపూడి మహేంద్రబాబు శనివారం ఉదయం కూలి పనికి వెళ్లి పారిజాతగిరి కొండ దిగువన పొలంలోని పాడుబడిన నీటి బావిలో పడి ఉన్నాడు. స్థానికుల సమాచారంతో ట్రైనీ డీఎస్పీ బి.విద్య, సిబ్బంది మృతదేహాన్ని వెలికితీసి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతడి తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

జంగారెడ్డిగూడెం, జనవరి 6: భర్త వేధింపులపై భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. మైసన్నగూడెం గ్రామానికి చెందిన ఉండ్రాజవరపు శ్రీనివాస్, మేరీలకు రెండేళ్ల క్రితం వివాహమైంది. ఈ నెల 5న శ్రీనివాస్ సీసాతో భార్య తలపై కొట్టి గాయపరచడంతో స్థానికులు ఆమెను ఆసుపత్రిలో చేర్పించారు. శ్రీనివాస్ మరో మహిళతో సంబంధం పెట్టుకుని తనను వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేసింది.

సారా తరలిస్తున్న వ్యక్తిపై కేసు

టి.నర్సాపురం, జనవరి 6: సారా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి సురేంద్ర కుమార్ తెలిపారు. తెడ్లం గ్రామానికి చెందిన చల్లారి నాగరాజు తెలంగాణ రాష్ట్రానికి సారా తరలిస్తుండగా లంకాలపల్లి వద్ద అదుపులోకి తీసుకొని 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు.

వేర్వేరు చోట్ల మోటార్ సైకిళ్ల అపహరణ

జంగారెడ్డిగూడెం, జనవరి 6: పట్టణంలో రెండు చోట్ల మోటార్ సైకిళ్ల అపహరణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన పిప్పర శ్రీనివాస్ ఈ నెల 4న తన మోటారు సైకిల్ ఒక ప్రైవేట్ ఆసుపత్రి బయట ఉంచి లోపలికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి మోటార్‌సైకిల్ అపహరించారు. పట్టణంలో ప్రైవేటు బ్యాంక్ ఉద్యోగి సాయిల అశోక్‌కుమార్ ఈ నెల 3న బ్యాంకు వద్ద మోటార్‌సైకిల్ ఉంచి విధులకు హాజరయ్యాడు. బయటకు వచ్చేసరికి మోటార్ సైకిల్ కనిపించలేదన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కోడిపందేలు, పేకాట నేరం

పెదపాడు, జనవరి 6: కోడిపందేలు, పేకాట చట్టరీత్యా నేరమని తహసీల్దారు విజయకుమార్ తెలిపారు. కోడిపందేలు, పేకాట నివారణ చర్యలపై రెవెన్యూ, పోలీసు, వివిధ శాఖల సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. తహసీల్దారు విజయకుమార్ మాట్లాడుతూ పండుగ వేళల్లో కోడి పందేలు, జూదం, గుండాట జరగకుండా క్షేత్రస్థాయి అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు.

పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన పోలీసులు

ఉంగుటూరు, జనవరి 6: కైకరం హైస్కూలు ప్రాంగణంలోని పోలింగ్ కేంద్రాలను చేబ్రోలు ఎస్ఐ ఎ.మణికుమార్ శనివారం పరిశీలించారు. పోలింగ్‌కు ఉండాల్సిన సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.



బుట్టాయగూడెంలో అంగన్వాడీల పొర్లు దండాలు, ఉంగుటూరులో మాట్లాడుతున్న పత్సమట్ల ధర్మరాజు, జంగారెడ్డిగూడెంలో గోరుముచ్చు గోపాల్‌యాదవ్ మద్దతు

అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగం మూర్ఖత్వం

రాజకీయ నేతల ధ్వజం

ఉంగుటూరు, జనవరి 6: అంగన్వాడీ వర్కర్లపై ఎస్మా ప్రయోగించడాన్ని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు ప్రభుత్వాన్ని తప్పుబట్టారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్మా ప్రయోగించాలనే నిర్ణయం మూర్ఖత్వం అన్నారు. 26రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీల సమస్యల పరిష్కరించడం మాని ఎస్మా ప్రయోగించడంపై జగన్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. జీవో నెం2తో అంగన్వాడీలను ప్రభుత్వ అత్యవసర సేవల్లోకి తీసుకురావడం దుర్మార్గమన్నారు.

● జంగారెడ్డిగూడెం టౌన్: అంగన్వాడీల సమ్మెను పట్టించుకోకుండా ప్రభుత్వం వారిని ఇబ్బందులు పెడుతుందని టీడీపీ యువ నాయకుడు గోరుముచ్చు గోపాల్ యాదవ్ అన్నారు. ఆర్డీవో కార్యాలయం వద్ద అంగన్‌వాడీల శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. అంగన్వాడీల సేవలను గుర్తించి శ్రమకు తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సాయిల సత్యనారాయణ, ముల్లపూడి శ్రీను, కొఠారి ప్రసాద్, ఆరిమిల్లి కళ్యాణ్ చౌదరి, సంకుల రాటాలురాజు, గద్దె జశ్వంత్ చౌదరి, గోరుముచ్చు శ్రీను, రవితేజ, సాయితేజ మున్నగు వారు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: అంగనవాడీలు పొర్లుదండాలతో నిరసన తెలియజేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి మాట్లాడుతూ 26 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో స్పందన లేదన్నారు. మోసపూరిత మాటలు చెప్పి రోడ్డుపాలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. భూదేవి, జ్యోతి, మంగతాయారు, దుర్గలక్ష్మీ, రాజకుమారి, దుర్గా, మంగమ్మ, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించకుండా ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమని వై.ఎ యికిరణ్ అన్నారు. అంగన్‌వాడీల ఉద్యమాన్ని అణచివేయడానికి ఎస్మా ప్రయోగిస్తున్నారని ఆరోపించారు. నిరసన వ్యక్తం చేస్తూ గుంజీలు తీశారు. రాయి రమణ, బాడిస సుజాత, కణితి మంగ, మహాలక్ష్మి, కారం రాధ, వరసా మంగ పాల్గొన్నారు.

● ద్వారకా తిరుమల: అంగన్వాడీ కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి 26 అంకెల నమూనాలో నిరసన తెలిపారు. తమపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం సమంజసం కాదన్నారు.



పెరుగుగూడెంలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్న చింతమనేని

పెరుగుగూడెంలో భవిష్యత్‌కు గ్యారెంటీ ప్రచారం

దెందులూరు, జనవరి 6: టీడీపీ పుట్టిందే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసమని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెరుగుగూడెంలో మాజీ సర్పంచ్ యలమర్తి హేమ శ్రీనివాస్, పావులూరి దశరథరామయ్య ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ ప్రచారం కార్యక్రమం శనివారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్, మోతుకూరి నాని, బొప్పన సుధాకర్ పాల్గొన్నారు

'రా కదలిరా' సభలతో జగన్‌కు వణుకు



విలేకరులతో మాట్లాడుతున్న బొరగం

బుట్టాయగూడెం, జనవరి 6: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రా కదలిరా అంటూ బహిరంగ సభలు నిర్వహించడంతో జగన్‌రెడ్డి గుండెల్లో వణుకు ప్రారంభమైందని నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ అన్నారు. బుట్టాయగూడెం క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. జగన్ పాలనలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేశారన్నారు. జగన్ సభలకు జనాలు రావడంలేదని, సభ ప్రారంభంకాగానే బారికేడ్లు తోసుకుని బయటకు వెళ్ళిపోతున్నారని తెలిపారు. చంద్రబాబు సభలకు జనాలు భారీగా తరలివస్తూ బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. వైసీపీ పాలనకు స్వస్తి పలకాలి, రా కదలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సున్నం నాగేశ్వరావు, మానెల్లి బాలు, శావిలి సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

బహిరంగ సభలను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

ఏలూరు టూటౌన్, జనవరి 6: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన ప్రజలకు వివరించేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహిస్తున్న రా.. కదలిరా సభలను విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కాశీ నవీన్‌కుమార్, ఇన్‌చార్జి బడేటి చంటి కోరారు. పవర్‌పేట టీడీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 7న ఆచంట, 29న ఉంగుటూరులో జరిగే బహిరంగ సభలను విజయవంతం చేయాలన్నారు. సైకో జగన్ గడిచిన నాలుగున్నర ఏళ్ళలో ప్రజలను ఎన్నో ఇబ్బందులు పెట్టారని అన్నారు. రాక్షస పాలన నుంచి విముక్తి కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబును చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ కార్యాలయ కార్యదర్శి పాలి ప్రసాద్, ఉప్పాల జగదీష్‌బాబు, శివప్రసాద్ పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు క్రైం, జనవరి 6 : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏలూరులో ఉన్న ఎంపిహెచ్‌డబ్ల్యు (ఫిమేల్) ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రెడ్‌క్రాస్ ఛైర్మన్ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నర్సింగ్ ట్యూటర్స్ ఫిమేల్ మూడు పోస్టులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఒక పోస్టు, డ్రైవర్ ఒక పోస్టు, స్వీపర్ ఫిమేల్ ఒక పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. దరఖాస్తులను ఈనెల 20న సాయంత్రం 5 గంటలలోపు ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. వివరాలకు 9848177142 లేదా 8919102822 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

మానవ అక్రమ రవాణా నిరోధించాలి

ఏలూరు క్రైం, జనవరి 6: మానవ అక్రమ రవాణా నిరోధించడానికి అందరూ భాగస్వాములు కావాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని లోక్‌అదాలత్ భవనంలో మానవ అక్రమ రవాణా - సంస్థ నిరోధం అనే అంశంపై సంబంధిత అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. బాధితులకు అందిస్తున్న వసతులు, తీసుకుంటున్న చర్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్టు డైరెక్టర్ పద్మావతి, డీసీపీవో సూర్య చక్రవేణి, కన్స్యూమర్‌ఫోరమ్ నెంబర్ నాగలక్ష్మి, సీఐ దుర్గా ప్రసాద్, న్యాయవాదులు, అధికారులు పాల్గొన్నారు.

దండు కదిలింది!

- జగన్ అరాచకాలపై ప్రజా దండయాత్ర
- అధినేత చంద్రబాబు జనం మధ్యకు
- ఆచంటలో నేడు రా.. కదలిరా సభ



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

మునుపెన్నడూలేని విధంగా గడిచిన ఐదేళ్లల్లో రాష్ట్రం లో అరాచకం పేట్రేగింది. టీడీపీ కార్యకర్తలపై నేరుగా అక్రమకేసులు, అరెస్టులు.. ప్రశ్నించిందే తడవుగా వైసీపీ మూకల దాడులు.. టీడీపీకి మద్దతు ఇస్తామన్న ప్రతి ఒక్కరిపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారు. విధ్వంస పాలనకు చరమగీతం పాడాలన్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పిలుపునకు తెలుగు నేల స్పందిస్తోంది. వరుస బహిరంగసభలకు చంద్రబాబు హాజరవుతున్నా రు. ఒకప్పుడు టీడీపీకి ఆయువుపట్టు అయిన పశ్చిమ గోదావరి జిల్లాలో వినూత్నమైన రీతిలో ఆదివారం ఆచంటలో జరిగే బహిరంగ సభలో చంద్రబాబు పాల్గొం టున్నారు. జిల్లాలు విభజించిన తరువాత లోక్‌సభ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు కలిపి ఒక జిల్లాగా విడగొట్టిన తరువాత మరింత విధ్వంసం సాగింది. పార్టీ ముఖ్యనేతలపై ఊహించని రీతిలో అక్రమ కేసులు మోపారు. ఇలాంటి పరిస్థితుల్లో తిరిగి టీడీపీకి పునర్వైభవం వచ్చేలా ఊరూవాడా జనం మద్ధ తుగా కదులుతున్నారు. తాజాగా విభజిత పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోను తెలుగుదేశం- జనసేన పొత్తుతో భవిష్యత్తులో పోటీ చేసే అభ్యర్థులతో ఎలా ఢీకొనాలో తెలియక అధికారపక్షం ఇప్పటికే విలవిలలాడుతుంది. ఉమ్మడి పశ్చిమలో కేవలం పాలకొల్లు, ఉండి నియోజకవర్గాల్లో మాత్రమే టీడీపీ విజయం సాధించింది. ఈ బలంతోనే మొక్కవోని దీక్షతో అధికార పార్టీ అరాచక పాలనపై ఎదురుదాడికి ధైర్యంగా దిగారు. పాలకొల్లు ఎమ్మెల్యే, శాసనసభాపక్ష ఉపనేత నిమ్మల రామానాయుడు నేరుగా అధికార పక్షంపై విరుచుకుపడుతూ వచ్చారు. ఆయన దూకుడును కట్టడి చేసేందుకు ఎస్సీ, ఎస్టీ కేసులను ఆయనపై మోపేందుకు అధికారపక్షం సాహసించింది. అయినా వెన్ను చూప కుండా ప్రజాఆందోళనలు నిర్విరామంగా కొనసాగించారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి, సీనియర్ నేత పితాని సత్యనారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆచంట నియోజకవర్గంలోను తెలుగు తమ్ముళ్లు ఎక్కడా తగ్గేదేలే అన్నట్టుగా ఇన్నాళ్లు జగన్ సర్కారుపై పోరాడుతూనే వచ్చారు. ఇళ్ల స్థలాల అక్రమాలపైన, ఇసుక ర్యాంపుల అక్రమాలపైనా ఎక్కడా వెనక్కి తగ్గకుండా సాహసోపే తంగా కేడర్ వెంట రాగా, పితాని నిరసన ఆందోళనలు కొనసాగిస్తూ వచ్చారు. బీసీ వర్గాలను ఆసాంతం పార్టీ ఆవిర్భావం నుంచి గౌరవిస్తున్నది, అండగా నిలు స్తుందని టీడీపీ మాత్రమేననే సంకేతం కూడా ఆచంట నుంచే ఇవ్వబోతున్నారు. భీమవరం, ఉండి, తాడేపల్లి గూడెం, తణుకు, నరసాపురం నియోజకవర్గాల నుంచి సభకు తరలివెళ్లేందుకు రైతులు, విద్యార్థులు, మహిళలు, పేద వర్గాలు తహతహలాడుతున్నారు.

సార్వత్రిక ఎన్నికలు జరిగేందుకు పట్టుమని వంద రోజులు కూడా లేక మునుపే ఇప్పుడు అధికార వైసీపీని గడగడలాడిస్తుంది. ప్రతీనియోజకవర్గంలోను కార్యకర్తలు ఒక్కటై తమ పార్టీ అధికారంలోకి వచ్చేలా జగన్ అరాచక పాలన అంతమొందించేలా చమ టోడుస్తున్నారు. విభేదాలకు తావులేకుండా ఉమ్మడిగా జనసేన, టీడీపీ శ్రేణులు ఒక్కటై నడుస్తున్నాయి. తాడేపల్లిగూడెం నియోజ కవర్గంలో కన్వీనర్ వలవల బాబ్జీ వైసీపీకి కంటిలో నలుసుగా మారడమే కాకుండా పార్టీ కేడర్ ఉత్తేజం, ఉత్సాహంగా పని చేసేలా సుదీర్ఘ కార్యాచరణకు ప్రణాళిక వేశారు. తణుకు నియోజక వర్గంలో నువ్వానేనా అన్నట్టు వైసీపీని టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఢీకొంటూ వచ్చారు. నియోజకవర్గంలో జరి గిన అక్రమాలన్నింటిపైనా ఆయన ఎలుగెత్తి పోరాడారు. కేసులకు భయపడకుండా ధైర్యంగా ఎదురొడ్డారు. ఉండి నియోజక వర్గంలోను ఎమ్మెల్యే రామరాజు వైసీపీపై పోరాడుతూనే పార్టీని పూర్తిగా విజయప థం వైపు నడిపించేందుకు సాయశక్తులా ప్రయత్నిస్తూనే ఉన్నారు. భీమవరం నియోజకవర్గంలో పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షురాలు సీతారామలక్ష్మితో సహా సీనియర్లంతా ఒకవైపు పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు కార్యక్రమాలు విజయవంతమయ్యేలా శ్రద్ధ పెడుతూనే వచ్చారు. మాజీ ఎమ్మెల్యే శివరామరాజు, ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ వంటి సీనియర్లంతా నిత్యం ప్రజల మధ్యే ఉంటున్నారు. చంద్రబాబు, లోకేశ్ నాయకత్వాన్ని పూర్తిగా బలపరిచే క్రమంలో పోరాడుతూనే ఉన్నారు. నరసా పురం నియోజకవర్గంలో కన్వీనర్ రామరాజు, మాజీ ఎమ్మెల్యే మాధవనాయుడు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి పార్టీ కార్యక్రమాల్లో నిత్యం మమేకమై ముందుకు సాగుతున్నారు. పథకాలపై విస్తృత ప్రచారం, మహిళల్లో అవగాహన కల్పించడంలో తలమునకలై ఉన్నారు. వారం రోజులుగా నియోజకవర్గ కన్వీనర్లు, పార్టీ కేడర్ నిత్య సమీక్షలు, చర్చలు సాగించడమే కాకుండా బహిరంగ సభ విజయవంతం అయ్యేలా ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. కనీవినీ ఎరుగని రీతిలో ఆచంటలోనే సభ జరగనుండడంతో పితాని అన్నింటిని తన భుజాన కెత్తుకున్నారు. భారీ ఎత్తున కేడర్ తరలివచ్చేలా అన్ని ఏర్పాట్లు చేశారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

నూజివీడు టౌన్, జనవరి 6: ట్రిపుల్ ఐటీలో విద్యుత్ సరఫరాను ఎట్టకేలకు పునరుద్ధరించారు. ట్రిపుల్ ఐటీకి విద్యుత్ సరఫరా చేసే ఇంటర్నల్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో రెండు రోజుల నుంచి సరఫరా నిలిచిపోయిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో అండర్ గ్రౌండ్ కేబుల్ ట్రాన్స్‌ఫార్మర్లలో తలెత్తిన లోపాన్ని సవరించిన అధికారులు శనివారం ఉదయం నూజివీడు ట్రిపుల్ ఐటీలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

12వ రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

నూజివీడు టౌన్, జనవరి 6: డిమాండ్ల సాధన కోసం మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 12వ రోజుకు చేరింది. నూజివీడు చిన్నగాంధీబొమ్మ సెంటర్లో మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులు నిరసన తెలిపారు. డిమాండ్లు నెరవేర్చాలని నినాదాలు చేశారు. సీఐటీయూ నూజివీడు ప్రధాన కార్యదర్శి జి.రాజు, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీహెచ్ పుల్లారావు, మున్సిపల్ యూనియన్ నాయకులు జయలక్ష్మి, గోవింద్, రజినీ, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి తహసీల్దార్‌గా రంగారావు

చాట్రాయి, జనవరి 6: చాట్రాయి తహసీల్దార్‌గా యలమర్తి రంగారావు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ విశ్వనాథరావు ఇటీవల మరణించటంతో, నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో కోనేరు రంగారావు భూ కమిటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న వై. రంగారావును చాట్రాయి తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఉత్తర్వులు జారీ చేశారు.

న్యాయవాదుల దీక్షలకు చిన్నం మద్దతు

నూజివీడు టౌన్, జనవరి 6: ప్రజల భూహక్కులకు భంగం కలిగించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన చట్టాన్ని వెంటనే రద్దుచేయాలని నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య డిమాండ్ చేశారు. ఏపీ భూహక్కుల చట్టం-2022ను రద్దుచేయాలని దీక్షలు చేస్తున్న న్యాయవాదుల దీక్షా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్, న్యాయవాదులు మడుపల్లి మధుశంకర్, మన్నెం రమేష్ తదితరులు పాల్గొన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేస్తున్న అంగన్వాడీలను కలిసి వారికి చిన్నం మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల జీతాలను పెంచాలని కోరారు.

ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఆగిరిపల్లి, జనవరి 6: ఆగిరిపల్లి ఎన్ఆర్ఐ కళాశాలలో సన్‌రైజ్ 2కె24 జాతీయ సదస్సులో రెండో రోజు శనివారం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఉర్రూతలూగించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ ఆర్.వెంకట్రావు మాట్లాడుతూ ఎన్ఆర్ఐ విద్యార్థుల ప్రతిభకు ఈ సదస్సులు ఉపయోగమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నాగభాస్కర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్‌కు పేపర్, పోస్టర్ ప్రజంటేషన్‌ను రూపొందించామన్నారు.

చనుబండలో మంత్రి తుమ్మల సతీమణి పూజలు

చాట్రాయి, జనవరి 6: తెలంగాణా రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సతీమణి భ్రమరాంబ, ఇతర కుటుంబ సభ్యులు శనివారం అపర భద్రాద్రి చనుబండ కోదండ రామాలయం, వీరాంజనేయస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి దంపతులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్ర గాయాలు

- స్తంభంపై మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ సరఫరా!

కైకలూరు, జనవరి 6: కైకలూరు రైల్వే స్టేషన్ సమీపాన పాత విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభం వేసి వైర్లు బిగించేందుకు విద్యుత్ కార్మికులు మండవల్లికి చెందిన కొండపల్లి రవి, ఉచ్చుల సుబ్బారావు స్తంభం ఎక్కారు. స్తంభానికి విద్యుత్ వైర్లు బిగిస్తున్న సమయంలో ఒక్కసారిగా విద్యుత్ సరఫరా రావడంతో కూలీ కొండపల్లి రవి షాక్ కొట్టి కిందపడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని స్థానికులు కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విద్యుత్ ఉన్నతాధికారులకు సమాచారమందించి పూర్తిగా సరఫరాను నిలిపివేసేవరకు మరో కూలీ సుబ్బారావు స్తంభంపై హాహాకారాలు చేశాడు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఈ ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రవికి బాగా రక్తస్రావం కావడంతో ఏలూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ముత్యాల ముగ్గులు



ముగ్గులు పరిశీలిస్తున్న పట్టణ ప్రముఖులు, నేతలు

జంగారెడ్డిగూడెం, జనవరి 6: ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీత్రి వేణి ప్రసాద్ విద్యాసంస్థల మైదానంలో శనివారం జరిగిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో మహిళలు ఈ పోటీ ల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం 63 మంది మహిళలు పాల్గొనగా మొదటి ముగ్గు రు విజేతలతో పాటు మరో పది మందికి కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. ఎస్. అమిత, సోయం మాధురి, డి.వెంకటలక్ష్మి, సీహెచ్ శశికళ, ఎన్.లక్ష్మీప్రీతి, దొంతు వర లక్ష్మి, బొల్లుబోయిన మణి, వి.మంగ, పి.నాగ శిరీష, వి.గాయత్రి కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. పాల్గొన్న ప్రతి మహిళకు ప్రోత్సాహక బహుమతి అందజేశారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెనుమర్తి రామ్‌కుమార్, రాజాన సత్యనారాయణ, చేను ప్రసాద్, సాయిల సత్యనారాయణ, బొబ్బర రాజ్‌పాల్‌కుమార్, పారేపల్లి నరేష్, గుళ్లపూడి శ్రీదేవి, కోటగిరి ప్రమీల, శ్రీదేవి, సుబ్రహ్మణ్యం, కాసాని ప్రసాద్, మన్యం దుర్గా రావు, రామచంద్ర రావు, రావూరి కృష్ణ, తూటికుంట రాము, నంబూరి రామచంద్రరాజు, ప్రసాద్, సిటీ కేబుల్ ఎండీ పాలపర్తి శ్రీనివాస్, దాకారపు గోపాలకృష్ణ, పరిమి సత్తిపండు, ఆలపాటి నాని, ఎస్ఆర్ఆర్ సూర్యనారాయణరాజు, మురళి, ఆంధ్రజ్యోతి సిబ్బంది ఉదయ్ భాస్కర్, జె.నరేష్‌కుమార్, ఎస్.కమలాకర్, నాదెండ్ల కృష్ణ, ఎం.సాయిబాబు, పి.రామకృష్ణ, దుర్గారావు, దాసు తదితరులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల నిర్వహణలో ఆంధ్రజ్యోతి సిబ్బంది











బి.మణి, ఎస్.మాధురి, డి.వెంకటలక్ష్మి, సీహెచ్.శశికళ, ఎన్.లక్ష్మీప్రీతికి కన్సొలేషన్ బహుమతులు అందజేస్తున్న బొబ్బర రాజ్‌పాల్‌కుమార్, పెనుమర్తి రామ్‌కుమార్, పారేపల్లి నరేష్, రాజాన పండు











వి.గాయత్రి, పి.నాగ శిరీష, వి.మంగ, ఎస్.అమిత, డి.వరలక్ష్మికి కన్సొలేషన్ బహుమతులు అందజేస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి రామకృష్ణ, ఉమ్మడి జిల్లా న్యూస్ కోఆర్డినేటర్ జీవీఎస్ఎన్ రాజు, బ్రాంచి మేనేజర్ బి.హరిబాబు, హెచ్‌బీఆర్ ప్రసాద్, సాయిల సత్యనారాయణ

తగ్గేదేలే

ఎస్మా హెచ్చరికలకూ లొంగని అంగన్వాడీలు



కలిదిండిలో మోకాళ్లపై నిలబడి అంగన్‌వాడీల నిరసన

ముదినేపల్లి, జనవరి 6 : ప్రభుత్వం ఎస్మాను ప్రయోగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినా అంగన్‌వాడీ కేంద్రాల ఉద్యోగులు తమ సమ్మెను కొనసాగిస్తున్నారు. ముదినేపల్లిలోని నిరసన దీక్షా శిబిరం వద్ద మండలంలోని అంగన్‌వాడీలు 160 మంది దీక్షల్లో పాల్గొన్నారు. నాయకులు సొంగా మణి, బండి పద్మ, సూరపనేని అరుణకుమారి తదితరులు మాట్లాడుతూ ఇన్నాళ్లకు ప్రభుత్వానికి అంగన్‌వాడీ కేంద్రాలు అత్యవసర సర్వీసులుగా గుర్తుకొచ్చాయా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు.

ఎస్మా ప్రయోగం దారుణం..

అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించటం దారుణమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. తెలుగు యువత కైకలూరు నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు, పార్టీ నాయకులు బొమ్మనబోయిన రత్నం, పంతగాని నాగ శ్రీనివాస్, కాసాని బాలయేసు శనివారం అల్లూరులో విలేకరులతో మాట్లాడుతూ ఎస్మాను రద్దు చేసి అంగన్వాడీల డిమాండ్లను పరిష్కరించాలన్నారు.

మోకాళ్లపై నిలబడి నిరసన

కలిదిండి: అంగన్‌వాడీలు శనివారం కలిదిండిలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. జీవో నంబరు 2ను రద్దు చేయాలని నినాదాలు చేశారు. నాయకులు అబిదా బేగం, రమాదేవి, మేనక లక్ష్మి, విజయ కుమారి, లావణ్య జ్యోతి, కృష్ణవేణి, సునీత పాల్గొన్నారు.

కైకలూరు: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో వైసీపీ పూర్తిగా విఫలమైందని అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు పి. సుజాత అన్నారు. శనివారం కైకలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు 26 అక్షరం నమూనాలో కూర్చుని నిరసన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి సమస్యలను పరిష్కరించకుంటే గుణపాఠం తప్పదన్నారు. ఎల్. మీనాకుమారి, విజిత, రమణ, ఉషా, ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: మండవల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీల దీక్షలు శనివారానికి 26వ రోజుకు చేరాయి. తమ సమస్యలు పరిష్కరించని సీఎం జగన్‌కు ఎన్నికల్లో గుణపాఠం చెబుతామన్నారు. అంగన్వాడీ నాయకులు చెల్లమ్మ, విజయలక్ష్మి, వాణి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఎవరికి టిక్కెట్ ఇచ్చినా పనిచేస్తాం : కమ్మిలి



కైకలూరు, జనవరి 6: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. శనివారం కైకలూరులో విలేకరులతో మాట్లాడుతూ కైకలూరులో టీడీపీ, జనసేన కూటమి కచ్చితంగా గెలుపొందుతుందన్నారు. మిత్రపక్షాలకు సీట్లు కేటాయిస్తే చంద్రబాబు ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటిస్తామన్నారు. విఠలరావు సతీమణి స్వర్ణకుమారి, మాజీ ఎంపీటీసీ తెంటు వెంకటరమణ, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కెకె బాబు, టీడీపీ మహిళా నాయకురాలు శీలం కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అందుబాటులో కామినేని

కైకలూరు, జనవరి 6: మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదివారం సాయంత్రం నుంచి కైకలూరు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు. 7వ తేదీ సాయంత్రం కలిదిండి మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. 8వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు తన ఇంటి వద్దే ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం గోపవరం, రాచపట్నం గ్రామాల్లో జరిగే ఆత్మీయ సమావేశాల్లో పాల్గొంటారని ఆయన వ్యక్తిగత సహాయకులు తెలిపారు.

మహిళా మార్ట్ ప్రారంభం



నూజివీడు, జనవరి 6: మహిళలు ఆర్థికంగా బలోపేతం అయినపుడే సమాజం సైతం బలోపేతం అవుతుందని నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడు పట్టణంలో ఆసరా మహిళా మార్ట్‌ను ఆయన ప్రారంభించారు. జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, కృష్ణాజిల్లా జడ్పీ వైస్ చైర్మన్ గుడిమెళ్ల కృష్ణంరాజు, నూజివీడు ఎంపీపీ ఆరేపల్లి శిరీష, వైస్ ఎంపీపీ అక్కినేని శ్రీవాణి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

భవనాలు ప్రారంభం.. పెన్షన్ల పంపిణీ

ముసునూరు, జనవరి 6: ముసునూరులో నూతనంగా నిర్మించిన ఆర్బీకే, అదనపు తరగతి గదుల భవనాలను నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు శనివారం ప్రారంభించారు. అలాగే మండలంలోని 16 గ్రామాల్లో నూతనంగా 105 మందికి మంజూరైన పెన్షన్‌లను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో పంచాయితీరాజ్ డీఈ డీవీ శ్రీనివాసరావు, ఏఈ దుర్గాప్రసాద్, ఎంపీటీసీలు, ఎంఈవో-2 సుబ్బారావు, ఎంపీపీ కొండా దుర్గాభవాని వెంకట్రావ్, జడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపీపీలు కోటగిరి రాజా, పాముల గంగధరరావు, పీఏసీయస్ అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరావు, ఎంపీడీవో జి.రాణి, తహసీల్దార్ దాసరి సుధ తదితరులు పాల్గొన్నారు.

'మోదీ పాలనలో గణనీయమైన అభివృద్ధి'

చాట్రాయి, జనవరి 6: మోదీ పదేళ్ళ పాలనలో దేశం గణనీయమైన అభివృద్ధిని సాధించిందని బీజేపీ మండల అధ్యక్షుడు ఓబిళ్ళనేని రాజా అన్నారు. నరసింహారావుపాలెం, పోతనపల్లి గ్రామాల్లో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్రం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



కానుకొల్లులో బాబు ష్యూరిటీ..

మండవల్లి, జనవరి 6: కానుకొల్లులో శనివారం బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు అధికారం లోకి వస్తే చేపట్టే పథకాలపై పార్టీ కైకలూరు నియోజకవర్గ నాయకులు ప్రజలకు వివరించారు. నాయకులు కొడాలి వినోద్, కైకలూరు జడ్పీటీసీ మాజీ సభ్యులు బొమ్మనబోయిన విజయలక్ష్మి, ముదినేపల్లి మాజీ ఎంపీపీ నరసింహారావు, కైకలూరు, మండవల్లి మండలాల నాయకులు పెన్మెత్స త్రినాథరాజు, నారగాని నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, రాజేష్, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల బహూకరణ



ముదినేపల్లి, జనవరి 6 : పెద గొన్నూరు రజకవాడలోని వేంకటేశ్వర స్వామి ఆలయానికి గ్రామానికి చెందిన రజక సంఘం ప్రముఖుడు లక్ష్మీపురపు వెంకట సుబ్బారావు దంపతులు ధనుర్మాసాన్ని పురస్కరించుకుని సుమారు రూ.70 వేల విలువచేసే రంగ నాయక, గోదా దేవి ఇత్తడి విగ్రహాలను బహూకరించారు. శనివారం అర్చకుడు లంక వెంకటేశ్వర బాబు విగ్రహాలకు పూజలు చేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ముదినేపల్లి రూరల్, జనవరి 6: శింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 86 రోజులకు గాను రూ.23,40,304లు నగదు, బంగారం 9 గ్రాములు, వెండి 1 కేజి 300 గ్రాములు లభించింది. హుండీ లెక్కింపులో శ్రీ దుర్గాశివసాయి సంఘం సేవా కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. గుడివాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్ సమక్షంలో ఆలయ సహాయ కమిషనరు, కార్యనిర్వహణ అధికారి నేల సంధ్య తదితరులు పర్యవేక్షించారు.

పీఏసీఎస్ భవనానికి శంకుస్థాపన

కలిదిండి, జనవరి 6 : కోరుకొల్లులో నిర్మిస్తున్న పీఏసీఎస్ భవనానికి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు శనివారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు చెన్నంశెట్టి కోదండరామయ్య, సొసైటీ చైర్మన్ అంకెం నరసయ్య ఉప సర్పంచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలన అంతం చేయాలి : ముద్దరబోయిన



నూజివీడు, జనవరి 6: వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలికేందుకు ప్రతి ఒక్కరూ కదలి రావాలని నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాడు ఎన్టీఆర్ 'తెలుగుదేశం పిలుస్తోంది.. రా కదలిరా' అంటూ ఇచ్చిన పిలుపునకు యావత్ ఆంధ్రావని జేజేలు కొట్టిందన్నారు. ఇప్పుడు అదే నినాదంతో ముందుకు దూసుకెళ్లాలన్నారు. బీసీలకు రాజ్యాధికారం ఇచ్చిన పార్టీ తెలుగుదేశం అన్నారు. వైసీపీ హయాంలో 26 మందికి పైగా బీసీ నాయకులు హత్యకు గురయ్యారని 650 మంది నాయకులపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. అలాగే 43 మందికి పైగా ముస్లిం, మైనార్టీలపై దాడులు జరిగాయన్నారు. తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి గద్దె రఘుబాబు, పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ నాయకుడు మాధవరావు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభకు తరలిరావాలి

నూజివీడు టౌన్, జనవరి 6: తిరువూరులో ఆదివారం నిర్వహిస్తున్న చంద్రబాబు బహిరంగ సభకు టీడీపీ శ్రేణులు తరలిరావాలని నూజివీడు టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కోరారు. తిరువూరు అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభకు పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని కోరారు. ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దెదింపే దిశగా కార్యాచరణ రూపొందించే క్రమంలో నిర్వహిస్తున్న ఈ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఘనంగా అట్లూరి జన్మదిన వేడుకలు



ముసునూరు, జనవరి 6: టీడీపీ నాయకుడు అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అట్లూరి వెంకట రవీంద్ర జన్మదిన వేడుకలను లోపూడిలో టీడీపీ నాయకుడు లక్కపాము కాంతారావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి, మిఠాయిలను పంచారు. అట్లూరి ట్రస్ట్ ద్వారా పేదలకు ఆర్థిక చేయూత, యువతకు అన్నివిధాలా ప్రోత్సాహకాన్ని అందిస్తున్న రవీంద్ర సేవలను కొనియాడారు. టీడీపీ నాయకులు చలమాల వెంకటేశ్వరరావు, నక్కా చెన్నా రావు, పొదిలి కృష్ణ, సొంగా ప్రసాద్, పేరిచర్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.